

# మరో ప్రపంచం



'బాలాజీ'

దూరాన కాలేజీ ఆవరణలో మోగే చర్చి గంటలు అలలు అలలుగా కమ్మగా హాస్టలు గదుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. మసక చీకట్లలో అరుణోదయం ఔతోంది. రాత్రి యేవేవో కలల్తో బేజారై పోయి తెల్లవారగట్ల మాగన్నుగా ఉన్నాడు రంగారావు. చర్చిగంటలు ఒకటే జీరగా గీమంటుంటే రంగారావుకు మెలుకువొచ్చింది. కను రెప్పలు బరువుగా విప్పి చూచాడు. పట్టపగలుగా దీపం, పూలకుండీలో చెండుగా చుట్టిన మందారాలు, అద్దంముందు నిలుచుని టై సర్దుకుంటున్న నేవీ బ్లూ సూటు విగ్రహం – రంగారావు కళ్లల్లోకి ఒక్కమాటే ప్రవేశించాయి. రంగారావు కళ్లు మూసుకుని ఆపక్కకి దొల్లుతూ

"ఏమిట్రా భాయీ! యిదంతా" అన్నాడు.

"ఏదంతా?" అన్నాడు జాన్ నిదానించి.

"ఈ వేషమంతా"

"వేషమా? ఏమిట్రోయ్! కలగంటున్నావా? నాటకశాలా పానశాలా?"

రంగారావుకు చిరుకోప మొచ్చింది.

"వేషంకాకపోతే ముస్తాబు. ముస్తాబుకాకపోతే టాయిలెట్. ఏదో వొహటి నీమొహం. సంగతేమిటి చెప్పరా అంటుంటే."

"ఈదినం ఆల్ సెయింట్సు డే. మతంకోసం మహత్తర త్యాగం చేసిన ప్రతిభాజీవుల ఆత్మకోసం చిన్నా పెద్దా అందరూ కలిసి ఈదినం అరుణోదయ ప్రశాంత సమయంలో ప్రార్థన చేస్తారు" అన్నాడు జాన్ ఉపన్యాస ధోరణిలో. మత విషయంమీద ఎప్పుడు ఏం మాట్లాడినా జాన్ ఒక ఆవేశంతో తాను ప్రసంగం చేస్తున్నట్టు మాట్లాడుతాడు.

ఈ ఉపన్యాసంతో రంగారావుకు మత్తు తగ్గిపోయింది. లేచి కూర్చుంటూ–

"ప్రార్థన చేస్తారట. యాడవలేకపోయారూ? ప్రార్థనంటే యిదిగాదురోయ్. ఆత్మ పరిశుద్ధి ఉండాలిగానీ, ఎప్పుడు చూచినా కడుపుమంటలూ, కళ్లమంటలూ, కుళ్లూ, కుత్సితమూ. అక్కడికి వెళ్లిన అరగంట కళ్లు మూసుకొని పెదిమలు కదిలిస్తే సరిపోయిందీ?... నాకు తెలియక అడుగుతా, దేవుడి దగ్గర కెళ్లేప్పుడు ఈ వేషమంతా ఎందుకూ? దేవుడుగాని మీ తాతయ్య అడిగినట్టు 'అబ్బాయ్! మొన్న కొత్తసూటు కుట్టించావటగా, వేసుకున్నట్టు లేవే' అని అడిగాడా?" అని మొదట కొంత ఆవేశంతో మాట్లాడినా తరువాత హాస్యానికి తిరిగాడు రంగారావు. ఎప్పుడూ యింతే. మతంమాట వచ్చినప్పుడు మొదట కొంచెం కోపంచూపి అలాగే హాస్యంలోకి దిగి, దేవుణ్ణి తుదకు వాళ్ళ బాబయ్యను గూడా ముందు వెనకా చూడకుండా హేళనచేసి పారేస్తాడు.

"ఏడ్చావు లేవోయ్. ఈనాటికి ఆత్మపరిశుద్ధి కలిగిన మహా ప్రవక్తవు బయలుదేరావ్. ఇహ నేం 'రావిజం' అనే ఒక మతం లేవతీయి. నీబోటి నాగమ్మల్ని ఓ నలుగురిని చేర్చుకొని బయలుదేరు, చెంబుకు నామాలు పెట్టుకుని... సూటేసుకున్నానట. మంచి బట్టలు కట్టుకోవడంకూడా తప్పేనా? చర్చి అంటే నలుగురూ చేరే చోటన్నమాట. సామాజికంగా ఒక విషయంలో పాల్గొనడం, సాంఘికంగా సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకోవడం అటువంటి చోటుల్లోనే. అక్కడికి సాధ్యమైనంత శుభ్రంగా నలుగురి కళ్లకూ నచ్చేలా వెళ్లాలి. అంతేగాని నేను ఆత్మపరిశుద్ధి కలవాణ్ణనీ, ప్రకృతి కతీతుణ్ణనీ మురుగు గుంటలోకి వెళ్ళి కూర్చోవడం మతంకాదు.... మతానికీ, సంఘానికీ పవిత్ర బాంధవ్యం కల్పించి సాంఘిక జీవనానికి మెరుగులు దిద్దుకోవాలి." జాన్ కళ్ళలో

ఏదో అవ్యక్త దివ్యత్వం ప్రతిఫలించింది. జాన్ దీప మార్పేసి తలుపుచేరవేసి వెళ్ళిపోయాడు చర్చివైపు.

దీపం ఆరిపోయినా రంగారావు కళ్ళల్లో గోడకున్న జీససుచిత్రం తాండవమాడుతోంది. సిలువమీది ఆ ప్రాణి చేతులనుండీ కాళ్ళనుండీ రక్త బిందువులు కోవెల్లోని ముత్యాల్లా రాలిపోతున్నాయి. రాలే బిందువల్లా 'సంఘంకోసం' 'వారి పాపాలకోసం' అని నవ్వుతూ రాలిపోతున్నాది. రంగారావు గట్టిగాకళ్లు మూసుకున్నాడు. తెలిమసక చీకటిలో నిశ్శబ్దం నర్తిస్తోంది. దూరంలో జిలిబిలిగా "ధమ్మం శరణం గచ్ఛామి" పాడుతున్న స్త్రీకంఠం "సంఘం శరణం గచ్ఛామి" అని హెచ్చుస్థాయికి తీసుకెళ్ళి ఆపేసింది. రంగారావు మళ్ళీ మాగన్నుపట్టాడు. ఓ అర్ధగంట తరువాత జాన్ గొంతుక వినిపించింది.

"రావ్! ఒరే రావ్! లేవరా త్వరగా. పాపం మహా కష్టపడిపోతోంది"

"మళ్ళీ ఏమిట్రా వెధవగోల? ఏం నువ్వు వెళ్ళలా చర్చికి?"

"చర్చికే బయలుదేరానురా బాబూ! హాస్టలు బయట వేపచెట్టు దగ్గిర కెళ్లేసరికి ఎవరో ఘోరంగా మూలుగుతుండడం వినిపించింది. వెళ్లి చూద్దును గదా ఓ మాలపిల్ల కనలేకపోతోంది. ఉండుండీ గుండెలు పగిలేటట్టు కేకలుబెడుతోందిరా. ఆ దృశ్యం చూచేసరికి నా నరాల్లోకి నిస్సత్తువ పాకిపోయింది. ఒక్క నిమషం కదల్లేకపోయాను. తరువాత గుండెధైర్యం తెచ్చుకొని రిక్షాకోసం పరుగెత్తాను"

"అంత ఆపన్నప్రసన్నుండు దీనమందారుండునైన జాన్" అని పురాణధోరణి లేపాడు రంగారావు.

జాన్ మొహంలో విషాదం చారలుకట్టింది. "ఒరేవ్! ఇప్పుడట్రా వేళాకోళం? ఆలస్యం చేస్తే ఒక నిండుప్రాణం పోతుందిరా... బౌద్ధసిద్ధాంతాలు హిందూమతంలో అంతర్వాహినులని వాదిస్తావే. మతం అంటే పుస్తకాల్లోనేనా ఉండేది? మనుషుల్లో లేదూ?...లేవరా బ్రదర్!" రంగారావుకు జీససు చిత్రమూ 'సంఘంశరణం గచ్ఛామి' అన్న గీతమూ కలంగోలా జ్ఞాపకమొచ్చాయి. ఇద్దరూ కదిలి పోయారు. నడుస్తూ జాన్ చెబుతున్నాడు:

"ఓ రిక్షావాణ్ణి తీసుకొచ్చాను. వాడు ఆ అమ్మాయి మొహం చూస్తూనే 'ఓహో అమ్మగారేనే. ఆ మిలిట్రీమొగుడు అమెరికాయి వెళ్లిపోయాడు కాబోల్నే? అయితేమాత్రం పురిటికర్చుకైనా సూసుకోబళ్ళా' అంటూ వెళ్లిపోబోయాడు. నేను ఊరుకోలేక 'ఒరే ఒహటికి రెండు ప్రాణాలురా. 'ఆసుపత్రి చేర్చావంటే ఒక్క రూపాయిస్తాను' అన్నాను. వాడు వెళుతునవ్వాడు ఆగి 'ఇదిసస్తే యేంలేబాబూ! మీరు రూపాయిస్తానంటేమాత్రం బోయోణ్ణి బోయి ఈ మాలదాన్ని మోస్తానా? కూటికి పేదను; కులానికి పేదను కాదనడోయ్' అంటూ వెళ్లిపోయాడు." అని జాన్ ఊరుకున్నాడు. రంగారావు తలవొంచుకొని నడుస్తున్నాడు. రోడ్డుమీద దుమ్ములోని రేణువులన్నీ "నేను నీకంటే కులంలో గొప్ప" అని ఒక దానిమీద ఒహటెక్కి సవారి చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. పోట్లాడుతున్నాయి. రంగారావు కంఠం పెగిలీ పెగలక "ఇది పవిత్ర భారతభూమి" అని ఏడుపు నవ్వు నవ్వింది.

స్నేహితులిద్దరూ ఆ మాలదాన్ని కష్టమ్మీద ఆసుపత్రిలో చేర్చి హాస్టలుకు తిరిగి వచ్చారు. నిన్న రాత్రి పరిచిన పరుపు యింతవరకూ చుట్టనేలేదు. నిద్రమొహంతో రంగారావు దానిమీద వాలిపోయాడు. అతగాడి మనసులో ఆలోచనలు తొక్కులాడుతున్నాయి. డాక్టరుబాబు ససేమిరా ఆ మాలదాన్ని చేర్చుకోనన్నాడు. డాక్టరు భార్య ముక్కుమీది రవ్వల ముక్కుపుడక మంచం ఖాళీ లేదని సాక్ష్యమిచ్చింది. సేవాపరాయణులైన సిస్టర్లయినా, దానిముఖం చూడలేదు. ఇది మరీబాగుంది. ఊరకేనే చూస్తారా యేం? వాళ్ళకుమాత్రం కూటికూరాలు దిల్ బహార్లు అవసరం లే? ఇంతలో జాన్ మొహం కడుక్కొని వచ్చి అద్దంలోకి చూచుకొంటూ కూనిరాగాలు తీస్తున్నాడు.

"ఏదేశమేగినా ఎందు కాలిడినా, పొగడరా నీ తల్లి భూమి భారతిని......లేదురా యిటువంటి భూదేవి యింకెందు, లేరురా నీవంటి వీరులీయిలలో" రంగారావు పాట అర్థం ఆలోచిస్తున్నాడు. అతగాడి కళ్ళల్లో సన్నటి నవ్వు తళుక్కుమంది.

తలుపు ధర్‌మని తోసుకుని వార్డన్ ప్రవేశించాడు. మొహాన తీగెలు తీగెలుగా కోపం సాగు

తోంది. "జాన్!" అని పొలికేక పెట్టాడు. "ఏం ఈదినం చర్చికి రాలేదు?"

"కాదండీ. మరీ......"

"కాదేమిటి కాదు. ఈదినం బైబిలు నువ్వు చదవాలని నాలుగు రోజులనాడు చెప్పి ఉంచానా లేదా? ఇప్పుడు సర్దుకోవడం సమాధానాలు చెప్పడమూనూ."

"మీరాలా కోప్పడితే నేనేం చెప్పను? అంతా తయారై చర్చికి బయలుదేరాను. పోష్టలు దాటే సరికి ఓ దిక్కులేని అమ్మాయి కనలేక ఘోర యాతనపడుతోంటే చూళ్ళేక ఆమెను ఆస్పత్రిలో చేర్పించడానికి..."

"చాల్లే చెప్పొచ్చావు సమాధానాలు. ఇలాంటి దారినబోయే అనామకులకు పరిచర్యలు చేస్తూ కూర్చోడానికి కాదు నీకు చర్చి సంవత్సరానికి రెండువందల రూపాయలు స్కాలర్ షిప్పు యిచ్చేది. ప్రతిదినం వేళ తప్పకుండా చర్చికి హాజరయి, ప్రార్థనల్లో పాల్గొని..." ఈ మాటలు వింటున్న కొద్దీ జాన్ కళ్ళలోని దివ్యజ్యోతి ఉజ్జ్వల ప్రదీపితమైపోతోంది. ఇక సహించలేక అందుకున్నాడు.

"చర్చికి వెళ్ళి ప్రార్థన చెయ్యగానే మనిషి కర్తవ్యం ఐపోయినట్లేనా? వేలకొలది దీనుల కష్టాలలో పాలు పంచుకొని యావజ్జీవం వారితో గడిపి తుదకు వారి పాపాలను తన రక్తంతో కడిగివేసిన ఆ ధన్యజీవి, ఒకచోట కూర్చొని కళ్ళు మూసుకుని ప్రార్థనలు చేసుకుంటూ జీవితాన్ని గడిపి వేసుకోలేక నేనా ఆ యాతనలన్నీ పడింది? మీరు ఈ విషయంలో పొరబడుతున్నారు."

వార్డన్ గొంతుకస్థాయి తగ్గి కరుణతో వణికింది. అతడికి ఎప్పటి కేమాత్ర వెయ్యాలో బాగా తెలుసు. "జాన్! నేనూ నీ వయస్సులో ఉంటే అలా అనుకొనేవాణ్ణే బాబూ. నా బుర్ర మత మీమాంసతో సగం నెరిసిపోయింది. చూడూ! ప్రభుసేవ పరమావధి. దయా, దానం, ధర్మం, యివన్నీ దానికి అవయవ మాత్రాలు. మతం ఏమంటోందో తెలుసా? స్వధర్మ నిర్వహణకంటే పరమ ధర్మం లేదని... అంటోంది."

"క్షమించండి. మీరు క్రైస్తవ ధర్మాన్నే మరచినట్టున్నారు. మతం అంటే నీవు ఉత్తముడవు నేను పాతకుడను అని ద్యూటీప్రకారం వల్లించడంకాదు. దయాంతఃకరణ పెంపొందించుకోవాలి. సంఘానికి స్నేహసౌహార్దాలు మూల స్తంభాలు కావాలి. మానవకార్యకలాపాల్లో కరుణ ప్రతిఫలించాలి. ఇది బైబిలు సారాంశం. ఏమతం సారమైనా యింతే." ఉద్రేకంతో జాన్ కంఠం మండిపోయింది. క్రైస్తవమతాన్ని కరతలామలకం చేసుకొని అన్ని మతాలలో సమ్యక్ జ్ఞానం సంపాదించానని రొమ్ము విరుచుకొని తిరిగేవాడు వార్డన్. ఈదినం అతనికి తల తీసేసినట్టయింది.

* * *

జాన్ యిప్పుడు వాళ్ల గ్రామంలో ఉంటున్నాడు. వార్డన్ ధర్మమా అని చర్చి యిచ్చే స్కాలర్షిప్పు రద్దయిపోగా చదివే చదువు చాలించుకుని యిల్లు చేరుకున్నాడు. జాన్ ఆలోచిస్తున్నాడు. ఇది రెండు సంవత్సరాలనాటి మాట. చర్చి మొహంచూచి రెండు సంవత్సరాలయింది. ఈనాడు మళ్ళీ బుద్ధి పుట్టింది. తెల్లవారుగట్ల లేచి చర్చికి బయలుదేరాడు. ఆనాడు ఆదివారం. జాన్ చర్చి చేరేసరికి ప్రార్థన ప్రారంభించారు. పరధ్యానంగా వెళ్ళి మిస్సు పంతులమ్మ ప్రక్కన కుర్చీ ఖాళీగా ఉంటే అక్కడ నిలుచున్నాడు. మిస్సమ్మ పెదిమలమీద నవ్వు చిలకరించుకొంటూ ప్రార్థనా పుస్తకాన్ని ఉమ్మడిగ పట్టుకొంది. ఫాదరీ ప్రార్థన చదువుతున్నాడు. అందరూ నిలుచుని ధ్యానంలో ఉన్నారు. నిశ్శబ్దంలో ఫాదరీ గొంతుక కంచు గంటలా వినిపిస్తోంది.

"దేవా! మానవ సమాజములోని పాపాత్ములను దుర్నీతిపరులను, సంఘములోని పేదసాదలను బానిసలను, లోకములోని పతితులను వ్యర్థజీవులను కాపాడవలసినదని ప్రార్థించు చున్నాము. ఆమేన్."

జాన్ కనుకొలుకుల్లో రెండు ముత్యాలు నిలిచాయి. ఇహ వినలేకపోయాడు. తల పట్టుకొని కుర్చీలో కూలపడిపోయాడు. ప్రార్థన యథా ప్రకారం సాగిపోతోంది.